సికిల్ సెల్ ఎనీమియాతో రక్తహీనత

హిమోగ్లోబిన్ తగ్గడంతో అనేక వ్యాధుల సంక్రమణ

సందేహం అనిపిస్తే అన్ని పరీక్షలు చేయించుకోవాలి

సికిల్ ఎనీమియా అవగాహన ర్యాలీల్లో అధికారులు

కొత్తగూడెం : అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తగూడెం అర్బన్ : అవగాహన ర్యాలీ..

అన్నపురెడ్డిపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేట : ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

కొత్తగూడెం టౌన్ : ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు

జూలూరుపాడు : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

భద్రాచలం : ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, సీడీపీవో

టేకులపల్లి : ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, సీడీపీవో, ఎంపీవో

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ కొత్తగూడెం అర్బన్/ అన్నపురెడ్డిపల్లి/ అశ్వారావుపేట/ అశ్వారావుపేట టౌన్/ కొత్తగూడెం టౌన్/ జూలూరుపాడు/ భద్రాచలం/ టేకులపల్లి, జూన్ 25 : సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచించారు. ఈ వ్యాధి సంక్రమిస్తే శరీరంలో రక్తహీనత పెరుగుతుందని అన్నారు. ఫలితంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనేక వ్యాధులు సంక్రమించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. సికిల్ సెల్ ఎనీమియా అనే వ్యాధి మానవ శరీరంలోని హిమోగ్లోబిన్‌పై ప్రభావాన్ని చూపిస్తుందని అన్నారు. తద్వారా హిమోగ్లోబిన్ తగ్గిపోయి రక్తహీనత వస్తుందని, దాని వల్ల మనుషులు నీరసించి పోతాడని అన్నారు. దానికితోడు వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో అనేక జబ్బుల సంక్రమించే ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు. పైగా గుండెనొప్పి, పక్షవాతం, పుపూస రక్త పోటు, అంధత్వం, పిత్తాశయ రాళ్లు, గర్భధారణ సమస్యలు, అవయవ నష్టం తదితర వ్యాధులు సంక్రమించే ప్రమాదాలు ఉన్నాయని వివరించారు. అందకని అందరూ సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా అన్నారు. కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, ఆయా ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలోల వైద్యాధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి: డీఈవో

కొత్తగూడెం టౌన్, జూన్ 25: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీల విద్యార్థులు, తల్లిదండ్రులకు సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలని డీఈవో వెంకటేశ్వరచారి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ సికిల్ సెల్ ఎనీమియా ఎలిమినేషన్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని, ఈ వ్యాధి నివారణ చర్యలపై తగిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.

ఘనంగా రామయ్య కల్యాణం

రామయ్యకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 25 : శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు నిత్య కల్యాణం ఘనంగా జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపి కల్యాణంలో పాల్గొన్న 32జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

రామయ్య సేవలో రిటైర్డ్ మేజర్ జనరల్


రామయ్యను దర్శించుకున్న రిటైర్డ్ మేజర్ జనరల్ ఆర్‌కే సింగ్, (ఎల్‌డబ్ల్యూఈ) సలహాదారులు

భద్రాచలం, జూన్ 25: భద్రాద్రి రామయ్యను మంగళవారం రిటైర్డ్ మేజర్ జనరల్ ఆర్‌కే సింగ్, తెలంగాణ(ఎల్‌డబ్ల్యూఈ) సలహాదారుడు, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను గూర్చి ఆర్‌కే సింగ్‌కు వివరించారు. వారి వెంట ఆలయ ప్రధానార్చకుడు అమరవాది విజయరాఘవన్, వేద పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

ఎఫికోర్ సంస్థ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ పంపిణీ

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం, జూన్ 25: ఎఫికోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని బి.కొత్తగూడెం, వైట్నగరం, పాత మారేడుబాక, రామారావుపేట, గంగోలు, ధర్మవరం, సింగవరం, గంగారం గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యుడు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వంశీ, ఆషా, సావిత్రి, కిరణ్‌బాబు, జాన్‌బాబు, వెంకటేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలను అమలుచేస్తాం'

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, జూన్ 25 : ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను కచ్చితంగా అమలుచేస్తామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నదని తెలిపారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని ప్రకటించటంతో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జయలక్ష్మి

మణుగూరు టౌన్, జూన్ 25: 3-6 పంవత్సరాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రీ స్కూల్ పాఠ్యాంశాలపై అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుట్టమల్లారం రైతువేదికలో జరిగిన రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతపై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం సికిల్ సెల్ అనిమియా వ్యాధి లక్షణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యవతి, సుశీల, భద్రమ్మ, పద్మ, సరోజిని, రాజామణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఈ ఫైలింగ్ కోసం ఫారం-16 సిద్ధం

భద్రాచలం, జూన్ 25 : 2023-24 సంవత్సరం ఇన్ కమ్ ట్యాక్స్ కట్టిన వారికి కావాల్సిన ఫారం-16 ఫారాలు ఆల్ పెన్షనర్స్ కార్యాలయాల్లో సిద్ధంగా ఉన్నాయని విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యుడు బందు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాక్స్ కట్టిన విశ్రాంత ఉద్యోగులు ఫారాలను తీసుకెళ్లి ఈ ఫైలింగ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలను అరికట్టాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణుగూరు టౌన్, జూన్ 25: మండలంలో అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు సోడె రవికుమార్ మంగళవారం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం అత్యధిక ఫీజుల వసూలును కట్టడి చేయాలని కోరారు. కార్యక్రమంలో పూనెం రమేశ్, ఇర్ప రవికుమార్ దొర, గనిబోయిన ముత్తయ్య, పూనెం నాగరాజు, వజ్జ జ్యోతి బసు, కృష్ణ, నరేశ్, కోడి నాగరాజు తదితరులు ఉన్నారు.

తాగునీటికి రూ.1.90 కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

దుమ్ముగూడెం/ భద్రాచలం, జూన్ 25 : మండలంలో తాగునీటి కోసం రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం లక్ష్మీనగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులకు రూ.60 లక్షలతోపాటు అన్ని పంచాయతీల్లో తాగునీటి కష్టాలు లేకుండా రూ.1.90 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గంగోలు పాఠశాల కురుస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో త్వరితగతిన మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. దుమ్ముగూడెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. నర్సాపురం పీహెచ్‌సీలో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ఈదయ్య, సీఐ అశోక్, ఎంపీవో ముత్యాలరావు, అధికారులు పాల్గొన్నారు. భద్రాచలం పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఆయన వెంట ఎండీ నవాబ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భద్రాచలంలోని ఏఎస్ఆర్ కాలనీ, అయ్యప్పకాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిట్టల లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు.

యువతి మృతదేహం లభ్యం

చర్ల, జూన్ 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పాతచర్ల నుంచి వెంకటాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన పాతచర్ల శివారు పంటపొలాల్లో గుర్తుతెలియని యువతి మృతదేహం పడి ఉంది. సోమవారం ఆవైపు వెళ్తున్న వ్యక్తులు ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన యువతి నోటినుంచి ముక్కులో నుండి నురగలు వచ్చిన గుర్తులున్నాయి. మృతురాలు ఎవరనేది తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికవాడల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి

ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఇల్లెందు రూరల్, జూన్ 25 : కార్మికవాడల్లో దొంగల సంచారం ఎక్కువగా ఉందని రాత్రివేళల్లో పోలీస్‌శాఖ వారు పెట్రోలింగ్ నిర్వహించాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఇటీవలే నూతన సీఐగా బత్తుల సత్యనారాయణ బాధ్యతలు చేపట్టాక జీఎం ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణ కోసం పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం మల్లారపు మల్లయ్య, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఎస్ఐ సందీప్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఖమ్మం వ్యవసాయం, జూన్ 25: జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో) కే.రాంగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై లకారం ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకుంటుందని వివరించారు. నగర వాసులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

- ఇల్లెందు సీఐ సత్యనారాయణ

ఇల్లెందు, జూన్ 25 : ఇల్లెందు మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పట్టణంలో రాత్రి 11గంటలకు దుకాణా సముదాయాలను మూసివేయాలన్నారు. యువత రోడ్డుపై మితిమీరిన శబ్దంతో బైక్‌ను వేగంగా నడిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, గుట్కా ప్యాకెట్లు తరలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రివేళల్లో పోలీసుల గస్తీ పకడ్బందీగా ఉంటుందన్నారు. యువత చెడు వ్యవసనాలకు బానిసకాకుండా ప్రయోజకులు కావాలన్నారు.

రిక్షా కాలనీలో ఫీవర్ సర్వే

మణుగూరు టౌన్, జూన్ 25: మండలంలోని సమితి సింగారంలోని రిక్షా కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గృహ సందర్శన చేసి నీటి నిల్వలను పరిశీలించి లార్వా వృద్ధి చెందకుండా నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించారు. 9 సంవత్సరాల బాలిక కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో ఆమెను ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఉమేశ్, పుష్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇల్లెందు రూరల్, జూన్ 25: విద్యుత్తు సరఫరాకు ఈ నెల 26వ తేదీ బుధవారం అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ రాము మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం బుధవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఇల్లెందు, గుండాల, ఆళ్ళపల్లి, టేకులపల్లి, కారేపల్లి మండలాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్తు శాఖకు సహకరించాలని కోరారు.

'కార్మికుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం'

వినతిపత్రం ఇస్తున్న యూనియన్ ప్రతినిధులు

కొత్తగూడెం అర్బన్, జూన్ 25 : పంచాయతీ కార్మికుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, శ్రీనివాసరావు, సత్య, భూక్యా రమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు విత్తనాలు పంపిణీ

బాధిత కుటుంబాలకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుండాల, జూన్ 25: మండలంలోని పోతురెడ్డిగూడెం గ్రామానికి చెందిన పది మంది రైతుల యాసంగి మొక్కజొన్న పంట అగ్నికి ఆవుతికాగా మంగళవారం బాధిత కుటంబాలకు గుండాల వాసవిక్లబ్ గ్రీన్ ఫీల్డ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. సుమారు రూ.75 వేల విలువగల విత్తనాలను వాసవి క్లబ్ అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. అలాగే వీరికి త్వరలో ఎరువులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాగబోయిన రామక్క, క్లబ్ కార్యదర్శి పుల్లకండ ఉపేందర్, కోశాధికారి అనుముల వెంకటేశ్వర్లు, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మానాల నారాయణమూర్తి, సభ్యులు మానాల వీరన్న, ప్రభాకర్, తవడిశెట్టి నాగరాజు, రాంబాబు, ఐత శ్రీశైలం, నాగమల్లేశ్, పూజిత్, పెండెకట్ల పెంటయ్య, వూకె బాబు పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

నిరసన తెలుపుతున్న మహిళలు

బూర్గంపాడు, జూన్ 25: మండలంలోని సారపాకలో మూడేళ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని దిశా, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. సారపాక సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ.. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, నామమాత్రపు కేసులు పెట్టి వదిలేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఐద్వా సంఘం మండల సభ్యులు, దిశా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సర్వీస్ పర్సన్‌ను నియమించాలి

ఆళ్ళపల్లి, జూన్ 25: నేటికి ప్రభుత్వ పాఠాశాలలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా.. సర్వీస్ పర్సన్ లేక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని టీఫీటీఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పాఠాశాలకు సర్వీస్ పర్సన్ నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

స్టేషన్ ఫైర్ అధికారిగా మేదరమెట్ల నవీన్

ఇల్లెందు రూరల్, జూన్ 25 : ఇల్లెందు అగ్నిమాపక కేంద్రం స్టేషన్ నూతన ఫైర్ అధికారిగా మేదరమెట్ల నవీన్ నియమితులయ్యారు. మంగళవారం అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారిగా పనిచేసిన రామారావు స్థానంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌తో నవీన్ వచ్చారు. రామారావు గతంలో ఇల్లెందు ఇన్‌చార్జ్‌గా సంవత్సరకాలం సేవలందించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన నవీన్ పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు రాసి ఉద్యోగం సాధించారు. నవీన్‌కు సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచ రూరల్, జూన్ 25 : మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయ మార్గాలు పెంచుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి మహిళా సంఘాలకు సూచించారు. మండలంలోని జగన్నాధపురంలో మంగళవారం జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి సంఘాల్లో చేరిన మహిళలు ఆర్థిక విజయాలు సాధిస్తున్నారని, మిల్క్‌పార్లర్, మొబైల్‌ఫిష్ రిటైల్‌షాపు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మీసేవ సెంటర్, క్యాంటిన్, గేదెల పెంపకం, కోళ్ల ఫారాలు తదితరలాంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో నారాయణ, ఏపీఎం నాయుడు రాంబాబు, ఏపీవో రంగా, సీసీ మురళి, పంచాయతీ కార్యదర్శి సాయిరాం, శంకర్ పాల్గొన్నారు.